# మధు

— పసుపులేటి మల్లిఖార్జునరావ్

"మృగరాజూ !" కొండకోనల్లోనూ, వనరాజు గుండెల్లో ప్రతిధ్వనించిందా పిలుపు.

రాత్రిల్లా కాపు వేస్తే — తెల్లవారుజామున పడిందొక జింక. తీగలతో తాడు పేని, దాన్ని జింక కాళ్ళకు కట్టి, యీడ్చుకు వస్తున్నాడు వనరాజు. దగ్గర్లో పడింది — గూడెం.

మరింత విషాదాన్ని నింపుకుంటూ మళ్ళీ వినిపించిందా కేక !

వనరాజు నిట్టూర్చాడు. జింకను అక్కడే వదిలి — ఎప్పుడూ వెంటఉండే చిన్న గొడ్డలిని, అక్కడే ఉన్న మర్రి చెట్టుకు కరిపించి — జింకను కట్టిన తీగలను దానిమొదలుకు కట్టాడు. అలాచేసి దాన్నక్కడ వదిలి వెళ్ళినా ఎవరూ ముట్టుకోరు. అందులో చెట్టు మొదలుకు — యిది వనరాజుది అన్నట్లు గొడ్డలి కన్పిస్తూంది.

కేక వచ్చిన దిక్కుగా — చెట్లనూ, తీగలనూ తొలగించుకుంటూ ముందుకు నడుస్తున్నాడు. ఆ కేక ఎవరు వేశారో అతనికి తెలుసు !

కొంతదూరం వెళ్ళాక — ఆ కేక వేసిన వ్యక్తి కనిపించింది ఆమెను చూస్తూనే వనరాజు "మధూ !" అని పిలిచాడు.

మధు వెనక్కి తిరిగి చూసింది. ముందుకు పరిగెత్తబోయింది — అతన్ని చూసి వనరాజు ఆమెను పట్టుకోబోయాడు. అందినట్లే అంది. ముందుకురికి చెట్లలోకి పరిగెత్తి మాయమైంది

వనరాజు కళ్ళు అశ్రువులను నింపుకున్నాయి. "యింటికి వస్తుంది...." అని తనలో తనే గొణుక్కుంటూ, యిందాక జింకను వదిలివచ్చిన వేపు నడుస్తున్నాడు.

ఆ జాతి వాళ్ళెవరో, ఎక్కడినుంచి వచ్చి యిక్కడ స్థిరపడిపోయారో, ఎవరికీ తెలియదు. వాళ్ళ భాష వేరు. ఆచార, వ్యవహారాలు వేరు.

వాళ్ళకు సింహాలంటే భయమూ, భక్తీ, అందుకే నాటి జోలికి పోకుండా, సాధ్యమైనంత దూరంగా ఉంటారు. వాళ్ళ నాయకుడిని కూడా "మృగరాజు" అనే పిలుస్తారు. ఉపనాయకుడిని — తమకు ఆశ్రయమిచ్చే వనాలకు కృతజ్ఞత తెలుపుకోవడం కోసం — "వనరాజు" అని వ్యవహరిస్తారు.

రెండు సంవత్సరాల క్రితం —

నాయకుడు మృగరాజు జబ్బుచేసి మరణించాడు.

మరొక నాయకుడిని ఎన్నుకోవడమంటూ ఉండదు. తండాల్లో ఉన్న యువకుల్లోనే ఎవరో ఒకరు, సవాలుచేసి — చిరుత పులితో పోట్లాడి గెలవాలి ; అలా గెలిచినవాడే మృగరాజు. ఎవరూ అలా చెయ్యలేకపోతే మరణించిన మృగరాజు సంతతికే ఆ పదవి దక్కుతుంది.

కుల పెద్ద యీ సంగతి చెప్పినపుడు — పంజా కొడుకు — భీమా, ముందుకు వచ్చి కులదేవత సాక్షిగా ప్రమాణం చేశాడు — తను చేసిన సవాలు నెగ్గించుకుంటానని.

ఎవరూ ఆశ్చర్యపడలేదు. భీమా బలంలో నిజంగా భీముడే ! అతను చిరుత పులిని జయిస్తాడనే అందరూ అనుకున్నారు. అలాగే జరిగింది. చిరుత పులిని కదలకుండా కట్టేసి, పండు వెన్నెల్లో కులదేవత సమక్షాన — మొదటిసారిగా కులపెద్దచేత "మృగరాజు" అనిపించుకున్నాడు — భీమా.

కాని సెలయేటికి అవతలి వైపున ఉన్న గూడేనికి ఉపనాయకుడిగా — మొత్తం తండాకు ఉపనాయకుడిగా బంటూను నియమించానని మృగరాజు ప్రకటించిప్పుడు అందరూ ఆశ్చర్యపడ్డారు — దానికి తమ అసంతృప్తిని ప్రకటించారు. ఎందుకంటే బంటూ మృగరాజులా పెద్ద దేహ బలం కలవాడు కాదు. అయినా వేటలో — బాణం గురిచూసి కొట్టడంలో — మల్లయుద్ధపు పట్లలో అతనికి ఉన్న నేర్పు మృగరాజు ఎరిగి ఉండటంచేత అతన్నే ఉపనాయకుడిగా ఎన్నుకున్నాడు.

అందరూ యీ విషయంపట్ల అసంతృప్తిని ప్రకటిస్తున్నారని తెలుసుకొని ఒకరోజు రచ్చబండ దగ్గర అతని నైపుణ్యాన్ని ప్రదర్శింపచేసే ఏర్పాటు చేశాడు. తనైతే — కావాలని అతనితో ఓడిపోయారంటారని అవతలిగూడెంలో వస్తాదులిద్దరితో బలప్రదర్శనం చేయించాడు. బంటూ రెండు పట్లు పట్టి వాళ్ళ యిద్దరినీ కదలకుండా చేశాడు, బాణం గురిచూసి కొట్టడంలో ఎవరూ అతనితో పోటీకి నిలవలేకపోయారు. అందరూ సమ్మతించారు. బంటూ 'వనరాజు' అయ్యాడు.

ఇది జరగటం యిష్టంలేని వాళ్ళుకూడా ఉన్నారు — యిద్దరు.

యిలాగే జరగాలనీ — జరిగితే దేవతలకు బలియిస్తామనీ మొక్కుకున్న వాళ్ళు ఇద్దరున్నారు.

మొదటి యిద్దరూ — చనిపోయిన మృగరాజు కొడుకులు — చెంచూ, మంటూ.

అంతకు ముందు భీమా అంటే వాళ్ళకేవిధమైన భావమూ లేకుండేది ; ఇప్పుడతని వాసనే గిట్టదు. వాళ్ళు అనుకున్నారు — ఎవరూ సవాలు చెయ్యరనే, తమలో పెద్దవాడిని మృగరాజుగా, రెండో వాడిని వనరాజుగా చేస్తారనీ. నిజానికి అలా జరిగేదికూడాను. కానీ భీమా సవాలు చెయ్యడంతో వాళ్ళ ఆశలు — నిరాశలైనాయి. పోనీ భీమాయే మృగరాజు అయి తమ యిద్దరిలో ఎవర్నో ఒకరిని 'వనరాజు' చేస్తాడనుకున్నారు. అదికూడా జరగలేదు. దాంతో వాళ్ళ యిద్దరి కోపాగ్నిలో ఆజ్యం పోసినట్లైంది.

మిగతా యిద్దరిలో- మొదటి ఆమె- వనరాజు చెల్లెలు- మధు మృగరాజు- భీమా- ఆమెకు చాలా రోజుల్నుంచీ తెలుసు. తన అన్నకోసం వస్తూ పోతున్నపుడు చాలా సార్లు చూసింది. మృగరాజు- భీమా, కూడా ఆమె కనిపించినప్పుడల్లా నవ్వుతూ పలకరించేవాడు.

వనరాజు- బంటూకు, మధు - మృగరాజును ప్రేమిస్తున్నట్లు స్పష్టంగా తెలుసు!

రెండవ ఆమె- గోదా! మరణించిన మృగరాజు కూతురు. గోదా కూడా మృగరాజు కాకముందు భీమాను ఎన్నోసార్లు చూసింది. ఆమె కూడా అతన్నే ప్రేమించింది. మృగరాజు పదవికోసం- చిరుత పులితో పోట్లాడబోతున్న భీమాకు బాగా బలం ప్రసాదించి, అతన్ని గెలిచేటట్లు చెయ్యమని, కోడి పుంజునుకూడా యిస్తానని మొక్కుకున్నది

మధూ, గోదా, యిద్దరూ స్నేహితులు! వాళ్ళ మధ్య సాధారణంగా దాచుకోవాల్సిన రహస్యాలంటూ ఉండవు. భీమా - మృగరాజు అయిన వెన్నెల రాత్రి- అతన్నీ, అతని వేషాన్నీ చూసి మురిసిపోతున్న గోదాను గమనించింది. అతన్నే రెప్ప వాల్చకుండా చూస్తూంది. గోదాను ఏమీ ఎరుగని దానిలాగే గమనిస్తూంది - మధు.

ఎవరి శక్తికి తగినట్లు వాళ్లు మొక్కులు సమర్పించుకుంటున్నారు- దేవతకు! అన్న బంటూ కన్న తెలివిగలది- మధు మొహం చూసి- లోపల ఏం అనుకుంటున్నదీ గమనించగల సమర్థురాలు.

మరింత పక్కకి జరుగుతూ పిల్చింది "గోదా!"

"ఆఁ! ఆఁ!" ఉలిక్కిపడింది మధూ పిలుపుకు మధు నవ్వుకున్నది.

"ఏమిటంత ఆలోచన?"

"ఏం లేదు.... ఏం లేదు...."

"లేకపోతే పోయిందిగానీ, మీ అన్న దేవతకు యిస్తానని నాలుగు కోళ్ళే యిచ్చింది గదా? మరి నువ్వు ఇంకో పుంజునుకూడా యిచ్చావేం?"

"దేవత మనల్ని రక్షించేది కదా? ఇస్తేయేం?"

"అబ్బో! మనం యిస్తామన్నంత తప్ప - ఒక్కరవ్వైనా దేవతకు అక్కర్లేదు. తెలుసా?"

.... .... .... .... .... ....

"ఎందుకేం? నాతో చెప్పవా?"

"ఉట్టిగానే!" లజ్జాభావం- గోదా కంఠంలో స్పష్టపడింది.

"అబ్బో! నాకు తెలుసు. ఎవరా పుంజు?" మధు నవ్వుతూ రెట్టించింది.

గోదా సమాధానం చెప్పలేదు. మధుకు గోదా మనసులో ఉన్నదెవరో తెలుసు. అందుకే ముందుకు చూస్తూ "అదిగో! మృగరాజు!" అన్నది.

గోదా తలఎత్తి చూసింది. ఎవరూ కనిపించలేదు.

మధు గలగల నవ్వింది. గోదా చెక్కిళ్ళు రక్తారుణిమను దాల్చాయి. చిరుకోపం తెచ్చిపెట్టుకుని "మధూ! ఏమిటది? ఎవరైనా వింటే...." అన్నది.

"ఆఁ! ఆ కోపం నాకు తెలుసు! అంతా వట్టిది. ఏదో పైకి...."

"ఛీ!...." మధును మృదువుగా భుజం మీద గిల్లింది- గోదా!

* * *

మృగరాజుకుగానీ, వనరాజుకుగానీ వేటాడవలసిన అవసరమే ఉండదు. మిగతా వాళ్ళు వేటాడిన దానిలో అయిదో వంతు- ప్రతి ఒక్కరూ తప్పకుండా యిస్తారు. అదే వాళ్ళకుటుంబాలకు సరిపోతుంది. ఎక్కువౌతుంది కూడా!

కానీ మృగరాజు- భీమా అలా చెయ్యలేదు. అందరితో కలసి, ఉత్సాహంగా వేటకు వెళ్ళేవాడు. వేటలో తను ముందుండేవాడు. అతను ఉచ్చు విసిరాడంటే ఎంత వేగంగా పోతున్న జంతువు అయినా ఆగిపోవలసిందే! ఎదురుగా వరిగెత్తి వచ్చే అడవి పందిని- కాస్త పక్కకి జరుగుతూ- ఒడుపుగా భల్లెంతో ఒక్క పోటు పొడిచి చంపేవాడు. ఎలుగుబంటి మూతి తీగలతో కట్టి- ముందరి కాళ్ళు, జూలు పట్టుకుని, ఆడించి వదిలేవాడు. మృగరాజుకు తోడు వనరాజు. అతని పని ఉచ్చులు పన్నడం, పైన ఎగిరే పక్షులను, నీటిలో వాలుగల్నూ, కొర్రమీన్లనూ తాళ్ళు గట్టిన బాణాలతో కొట్టి పట్టుకునే వాడు.

తమ నాయకులిద్దరూ- యిలా తమతో కలసిపోవడం, తండా అంతటికీ ఎంతో యిష్టమైంది. పైగా- వాళ్ళు వేటాడి, తమ కుటుంబాలకి సరిపోగా మిగిలిన మాంసం- కుల పెద్ద వంతు పోగా- గూడెల్లో వేటాడటానికి అశక్తులై, కొడుకులూ, కూతుళ్ళూలేని వృద్ధులకు పంచి యిచ్చేవారు. సాధారణంగా చాలా మాంసం మిగులుతూ ఉండేది. ఎందుకంటే మృగరాజుకు- తల్లీ తండ్రీ యిద్దరే! వనరాజుకు కూడా చెల్లెలు- మధు- తప్ప నా అన్న వారెవ్వరూ లేరు.

మృగరాజు సాహసాన్ని, వనరాజు చాకచక్యాన్నీ గురించి ఎవరు చెప్పుకున్నా గోదా తప్పకుండా వినేది. మధు అన్న ద్వారా మృగరాజు ధైర్యాన్ని గురించి వినగలుగుతూండేది. గోదాకు ఎవరైనా చెప్పుకుంటే తప్ప- వినే అవకాశమే ఉండేది కాదు. ఆమె అన్నలిద్దరూ- అతని పేరు అయినా ఎత్తేవారు కాదు. పైగా చిట చిటలాడే వారు. అంత బలవంతుడూ అందగాడూ, అయిన మృగరాజు అంటే అన్నలకు అంత కోపం ఎందుకో- గోదాకు అర్థంగాకపోయేది.

మధు ద్వారా మృగరాజు గొప్పతనాన్ని వినగలిగేది. గోదాకు మృగరాజును కలుసుకోవాలనీ, అతనితో మాట్లాడాలనీ, చాల కోరికగా ఉండేది. అప్పుడప్పుడు తనఅన్న కోసం యింటికి వచ్చి- తనను పలకరించాడని- గోదాతో, మధు చెప్పినపుడు ఆమె అదృష్టానికి యీర్ష్యపడేది. తన అన్నలు అతనికి స్నేహితులైనా, లేక తను వనరాజు చెల్లెలైనా బాగుండును అనుకునేది. పోనీ తనొక్కతే కలుసుకుని మాట్లాడదామంటే? అబ్బో.... అతను మృగరాజు!

( తరువాయి 23 వ పేజీలో )

## మధు

(10 వ పేజీ తరువాయి)

తనతో మాట్లాడతాడా? అన్నలకు తెలిస్తే- చంపేస్తారు. అటీగాక పెళ్ళికాని పిల్లని- అట్లా తమంతటతామే చెప్పకూడదు- మృగరాజు ముందు! అది చాల పెద్ద తప్పు! అందుకే ఆ ప్రయత్నం చెయ్యలేదు.

విజయదశమి రెండుగూడేల్లోనూ చాలా ఉత్సాహంగా గడిచింది. అందరూ పండుగ ఉత్సవాలు ముగిశాక, తిరిగి దైనందిన కార్యక్రమాల్లో పడిపోయారు.

ఆవేళ-

కొద్దిగా ఆలస్యం అయింది. మధు అవతలి గూడెంలో ఉంటుంది. రెండు గూడేలకు మధ్య సెలయేరుంది, దానిమీద చిన్న చెక్క వంతెనుంది. గోదా కోసం వస్తూన్న మధుకు- గోదా యేటి దగ్గరకు రావడం, నీళ్ళు ముంచుకొని కడవ నెత్తిన పెట్టుకోవడం- అంతా కన్పిస్తూనే ఉంది. పిలవకుండా- ఎలాగైనా ఆమెను కలుసుకుంటానన్న ఉద్దేశ్యంతో వస్తూంది మధు.

కడవ నెత్తిన పెట్టుకుని వయ్యారంగా నడుస్తూంది గోదా. మధు చక్కవంతెన మీదికి వచ్చింది.

అంతలో "ఏయ్! పిల్లా.... అడ్డం జరుగు... పడిపోతావ్.... అరెరె...." అన్న కేక వినిపించింది.

వింటి నుండి విడిచిన బాణంలా దుప్పి పిల్లొకటి గోదాను రాసుకుంటూ పరిగెత్తింది. ఆగి వెనకకు తిరిగిచూడబోతున్న గోదా నెత్తిన కుండ పట్టుతప్పింది. అది కింద పడి పగిలేముందు గోదానుకూడా తడిపి వేసింది.

గోదాకు కోపం వచ్చింది. యీ దుండగానికి కారకులెవ్వరో నని తీక్షణంగా వెనక్కి చూసింది.

యిదంతా గమనిస్తున్న మధు వంతెన దిగి- అక్కడే ఉన్న రావిచెట్టు మొదలు చాటు చేసుకుని- యీ తతంగమంతా చూస్తూంది.

అప్పటికే తనను సమీపించిన వ్యక్తిని చూసి, గోదాకు నోటమాటరాలేదొక క్షణం.

అతను! ఆమె ఎప్పుడూ తలంచే వ్యక్తి- మృగరాజు!

ఎన్నడూ- యిద్దరూ అంత దగ్గర దగ్గరగా చూసుకోలేదు

మృగరాజే ముందు తేరుకున్నాడు. "ఏయ్ పిల్లా! ఎవర్నువ్వు? మా గూడెమేనా?" గోదాకు ఆ మాటలు తియ్యగా విన్పించాయి. మృగరాజు ఆమె అందాన్ని కళ్ళతో త్రేస్తున్నాడు.

"ఎవర్నువ్వు అంటే మాట్లాడవేం?" మరింత దగ్గరికి వచ్చాడు.

నెమ్మదిగా "చెంచూ చెల్లిలిని" అంది గోదా.

"పాత మృగరాజు బిడ్డవా? నీ పేరు గోదా కదూ?"

తలూపింది.

"ఇప్పుడు నేనే మృగరాజును!" ఎదురు రొమ్ము మీద కొట్టుకున్నాడు.

తెలుసన్నట్లు- మౌనంగానే జవాబిచ్చింది- తలవూపి.

'మూగ దయ్యానివా? మాటలురావూ?'

.... .... .... .... .... ....

"మాట్లాడ వేం? యిలా చూడు!"

గోదా తలెత్తి మృగరాజును చూసింది. ఆ చూపుల్లో- తీపి- మృగరాజు భరించలేక పోయాడు.

రెండు క్షణాలు పక్షుల కలకలలే వాళ్ళ మధ్య నిలుచున్నాయి.

చెట్టుమీద పిట్టొకటి - మృగరాజు నెత్తిమీద తను తినగా మిగిలిన గింజను వదిలింది. మృగరాజు ఉలిక్కిపడ్డాడు. తన పరిస్థితి జ్ఞాపకానికి వచ్చి "పగిలిన కుండ బదులు కుండ కావలిస్తే- మా అమ్మ నడుగు - యిస్తుంది. ఇంకెప్పుడూ యిలా బైట తిరగకు!" అని ఉచ్చుతాడు గిరగిర తిప్పుతూ ముందుకు పరిగెత్తాడు.

అతను కనుమరుగు కాగానే, మధు యివతలికి వచ్చింది. గోదా యింకా అతను వెళ్ళినవేపే చూస్తూంది. మధు- గోదాను సమీపించి "ఊఁ! చాల్లే! యింకా ఎంతసేపు అలా నిలుచుంటావు! దిష్టి తగిలేను! అన్నది.

గోదా తుళ్ళిపడింది. "ఏమిటి? ఏమిటి? మాధూ?"

"ఏం లేదూ! చూడటం అయిందా?"

"ఏం చూస్తున్నాను?" తలదించుకుంది,

"పగిలిన కుండ ముక్కల్ని కాదు- మృగరాజును!"

"నువ్వలా అంటే మీ భయ్యాతో చెపుతా!"

"భయ్యాతో కాదూ- మృగరాజుతో అను!"

చేతిలో ఉన్న గడ్డిపరకతో మధును కొట్టబోయింది. కానీ మధు అందకుండా దూరంగా పరిగెత్తి "మృగరాజుకూడా వల్లో పడ్డాడు. ఒట్టువేయించి- పెళ్ళిచేసుకున్నాక చింత బరికెలతో కొట్టించు" అన్నది- నవ్వుతూ.

మృగరాజు తన్ను మాట్లాడించిన దగ్గర నుంచీ- గోదాకు- మనసు గాలిలో తేలిపోతున్నట్లుంది. అతను కుండ కింద పడటానికి కారకు డయ్యాడన్న కోపం కూడా లేదు! అయినా అది అతనితప్పుకాదు.

* * *

గోదా ఇద్దరన్నలూ ఎవరితోనూ కలవరు. వాళ్ళు యింకా పైఅడవుల్లోకి పోతారు అలాగేవెళ్ళారు. రేపు రాత్రికిగాని రామని చెప్పి పోయారు.

వెన్నెల్లోకూచుంటే- గోదాకు, ఏదో పోగొట్టు కుంటున్నట్లుంది. ఇంట్లో గోదా ఆమెతల్లీ- యిద్దరే! నెలరాజు నెత్తిమీదకి వస్తున్న కొద్దీ గోదా మనసులో ఏదో ఆరాటం, చెప్పలేని ఉత్తేజం. ఏదో పొందాలన్న కోరిక.

తల్లివైపు చూసింది నిద్రపోతూంది- తల్లి. కాసేపు ఏదో ఆలోచించుకుని, నెమ్మదిగాలేచి- తెరిచి ఉన్న తడికను దగ్గరికిలాగి తాడు కట్టింది. మళ్ళీ తల్లివైపొక సారిచూసి- కొండకోన వైపునడిచింది.

మృగరాజు పరిస్థితీ అలాగేఉంది. గోదాను చూసిన దగ్గర్నుంచీ మనస్సంతా కలవరంగాఉంది. కన్నుమూసినా, తెరచినా గోదారూపమే! ఆవేళ సరిగా వేటాడలేదు కూడను. ఒక్కో జంతువును పట్టుకోడానికే ఎంతో ఆలస్యం అయ్యింది. అంతకుముందు ఆమెని ఒకటి రెండు సార్లు చూసినా ఏమని పించలేదుగానీ- అప్పుడిలా అనిపించలేదు.

నిద్ర పట్టటంలేదు. మనస్సు గోదాను చూడాలని ఉరకలు వేస్తూంది. కాని పెళ్ళి కాని పిల్లకోసం అలావెళ్ళటం తప్పు. ఏం వంకతో వెడతాడు? అందులో తను నాయకుడు!

చాలాసేపు ఆలోచనల్తో సతమతమై- ఏదో నిశ్చయించుకుని- లేచి ఉచ్చుతాడు తీసుకుని- యిప్పుడేవస్తానని తండ్రితో చెప్పి బైటికి వచ్చాడు.

రానైతే వచ్చాడు గాని - ఎటు వెళ్లాలో తోచలేదు. వద్దనుకుంటూనే కొండ కొన వైపు దారితీశాడు.

వెన్నెల్లో - కొండ కొనమీద - పరుపు రాతిమీద - ఎవరో కూచుని ఉండటం గమనించాడు మృగరాజు! అలవాటు ప్రకారం తాడు తిప్పుతూ అంత దూరాన్నుండే కేకవేశాడు.

"ఎవరావహో! నేను మృగరాజును!"

ఎదురుగా కింద కన్పిస్తున్న సెలయేటి సరస్సునూ, దాని పక్కనే అగాధాన్నీ చూస్తూ ఏదో ఆలోచిస్తూన్న గోదా ఉలిక్కిపడింది ఆకేకవిని.

లేచి విల్చుంటూ వెనక్కి తిరిగింది. అప్పటికే మృగరాజు ఆమెను సమీపించాడు.

యిద్దరూ ఒకరినొకరు చూచుకుని కాకతాళీయమైన యీ సంఘటనకు తెల్లబోయారు చాలాసేపటివరకు వాళ్ళలో కదలికల ఛాయకూడా కనిపించలేదు,

ముందు మృగరాజే నిశ్శబ్దాన్ని భంగపరిచాడు. "రాత్రిపూట, ఒంటరిగా యిక్కడెందుకున్నావు?"

నెమ్మదిగా గొణిగింది. "నువ్వెందుకు వచ్చావు?"

"నేనా? నేనే.... నేనంటే మగవాడిని. పైగా మృగరాజును!"

గోదా మాట్లాడలేదు.

"పెళ్ళికాని ఆడపిల్లవు! యిలా ఒంటరిగా రాత్రిళ్లు బైటికి రావడం అందరికీ తెలుస్తే నిన్నూ, మీ వాళ్ళనూ బతకనియ్యరు"

.... .... .... .... ....

"ఎందుకు వచ్చావు? మాట్లాడవేం" మృగరాజు ఆమెకు మరింత దగ్గరగా జరిగాడు.

గోదా గుండెలు దడదడ మన్నాయి. అప్రయత్నంగా ఒక అడుగు వెనక్కి వేసింది.

"నిన్నకూడా యిట్లానే మాట్లాడకుండా నిలుచున్నావు. మూగి దయ్యానివా?"

ఊఁ! ఊఁ" అంతకన్నా ఏమనాలో గోదాకు తోచలేదు.

"నిజమే! బాగుంది. ఏదన్నా ఎత్తుకుపోతే?"

"ఏం ఎత్తుకు పోతుంది?" కాస్త ధైర్యంగా అంది గోదా.

"ఏదో నాబోటి అడవి మృగం!"

అందులోరెండర్థాలు గోదాతెలుసుకుంది తలవంచుకునే అన్నది. "ఎ.... ఎత్తుకుపోయి ఏం చేసుకుంటుంది?"

అది ఆమె అమాయకంగా వేసినప్రశ్నే! అయినా మృగరాజు నిరుత్తరుడైనాడు. జవాబు ఏం చెప్పాలో తోచక- చివరికి అన్నాడు. "మొత్తంమ్మీద తెలివిగలదానివే. ఏం పిల్లా!"

గోదా సిగ్గుతో వంచిన తలఎత్తలేదు అదే రోజు- ఆ వెన్నెలరాత్రి- వాళ్ళ స్నేహానికి నాంది.

ప్రతిరోజూ రాత్రిపూట- వనరాజు వచ్చి మృగరాజుతో కాసేపు మాట్లాడి పోతూ ఉంటాడు. వరసగా అయిదారు రాత్రుల నుంచీ మృగరాజుతో కలవటంలేదు- వనరాజునకు. తరవాత కలిసినవుడల్లా అడిగేవాడు. మృగరాజునుంచి దానికి సంబంధించిన సమాధానం లేదు.

అయిదారు రోజులనుంచీ రాత్రి పూట ఎక్కడికో వెళతున్నాడని మృగరాజు తండ్రి, పంజా-చెప్పాడు.

మృగరాజు ఎక్కడికి వెళ్ళేవాడో వనరాజుకు అంతు పట్టలేదు. ఆ రోజుకూడా మృగరాజుకోసం వెళితే లేడు. ఆలోచిస్తూ, వంతెనదాటి యింటికివచ్చి- ఎప్పుడూ చేతిలోఉండే చిన్న గొడ్డలితో పుల్లలను చీలుస్తూ- వెదురుమంచంమీద కూచున్నాడు

మధు అడిగమనించింది. సాధారణంగా మధు తనంతట తను వనరాజును మాట్లాడించదు. వనరాజే అవసరం అయితే ఆమె సలహాలను అడుగుతాడు. వనరాజు తలలో మెదలుతున్న విషయం మధుకు తెలుసు. దాని పరిష్కార మార్గంకూడా ఆమెఎరుగును

ఆమె అనుకున్నట్లు వనరాజు ఆమెను పిలిచాడు. దగ్గరకూచో బెట్టుకుని మృగరాజు విషయం అంతాచెప్పాడు. మధు ఒక్క ఎదురుప్రశ్న అయినా వెయ్యకుండా అదంతా విన్నది. అంతా చెప్పినతర్వాత "అడిగితేమనస్సులో ఉన్నదిచెప్పడు 'నీకేది కావాలన్నా చేసిస్తానన్నా మాట కూడా జారడు!' అన్నాడు వనరాజు.

మధు- అసలు విషయం చెప్పాలా వద్దా అని తర్కించు కుంటూంది. "నీ సలహా ఏమిటి మధూ!" వనరాజు అడిగాడు.

చివరకు చెప్పటానికే నిశ్చయించుకున్నదిమధు. మృగరాజుకేం కావాలో వనరాజుకు తెలియక పోయినా, మధుకు తెలుసు

ముందు అన్నచేత ఒట్టువేయించుకుంది మృగరాజుకు ఏవిధమైన హానిచెయ్యవద్దనీ, అతనికోరిక తీర్చటానికే ప్రయత్నించమని వనరాజు పరేనన్నాడు.

మధుచెప్పటం పూర్తిఅయ్యాక వనరాజు దీర్ఘంగా విశ్వసించాడు "ఇటువంటిది ఏదో అయివుంటుందని నేనప్పుడే అనుకున్నాను"

"అన్నా! కొండకోనలేదూ? అక్కడ కలుసుకుంటారు"

"ఊఁ!" వనరాజు వడుంవాల్చాడు.

అర్ధరాత్రి దాటి ఉంటుంది. సెలయేటి కవతలి గూడెం, ఇవతలి గూడెం, రెండూ నిశ్శబ్దంగా ఉన్నాయి. మధ్య మధ్య అడ

విలో నుంచి వచ్చే మృగాల అరుపులూ, కుక్కల బెదరింపులూ, నిశ్శబ్దాన్ని కలుషితం చేస్తున్నాయి. నిసీలాకాశానికి వెండి పూత పట్టించాలని చంద్రుడు ప్రయత్నిస్తున్నాడు.

కొండకోన. కిందకు చూస్తే గూడేన్ని రెండుగా చేస్తున్న సెలయేరు చిన్న సరస్సును సృష్టించి కొండవాలు నుంచి కింద జారి జలపాతాన్ని స్ఫురింపచేస్తూ, కొండ కావలివైపున మలుపులో మాయమవుతోంది. ఇటు పక్క చీకటినంతా తనలో నింపుకుని లోతు తెలీని అగాధం. రెండిటికీ మధ్యా ఆకాశాన్నంటుతున్నట్లు ఠీవిగా తలలెత్తి చూస్తున్న దేవదారు, సరివి, టేకు మొదలైన చెట్లు

"వెళ్తాను మృగరాజూ!" గోదా అన్నది.

'అప్పుడే? కోడికూతకు ఇంకా చాలా సేపు ఉంది' ఆమెను వదిలి పెట్టాలన్న ధ్యాసే లేదు మృగరాజుకు.

'ఇవాళ మా అన్నలు వస్తారు!'

'ఉదయమే గదా వెళ్ళింది?'

'ఎప్పుడు పోయినా వాళ్ళయిష్టం!' ముందుకు అడుగు వెయ్యబోయింది. చెట్ల మాటున ఏదో అలికిడి అయింది, గోదా ఉలిక్కిపడింది.

ఆగి 'మృగరాజూ! అదేమిటి ఆ చప్పుడు? నాకు భయంగా ఉంది' అన్నది.

మృగరాజు ఆమె వెనక్కి వచ్చి నిలుచున్నాడు. 'ఏదో పురుగు! మృగరాజు ఉన్నంత వరకూ నీకే భయమూ వద్దు!'

గోదా అతనివైపు చంచల దృష్టులను ప్రసారించి గబగబ వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిన వైపే చూస్తూ నిలుచున్నాడు. మళ్ళీ ఇందాకటిలాగే ఆకులు కదిలిన చప్పుడైంది. మృగరాజు వెంటే తెచ్చిన ఉచ్చుతాడు అందుకుని చప్పుడు వచ్చిన వైపు చెవులప్పగించి వింటూ, రాబోయే ప్రమాదాన్ని ఎదుర్కొడానికి సిద్ధంగా ఉన్నాడు.

"మృగరాజూ!" అన్న పిలుపుతో బాటు వనరాజు పొదల్లో నుంచి బైటికి వచ్చాడు.

మృగరాజు తెల్లబోయాడు. యిక్కడ యీ సమయంలో వనరాజు యీ పొదల్లో కూచోడానికి కారణం ఏమిటి?

"మృగరాజూ! పదు. అలాగే నిలుచున్నావేం?"

"నువ్వు.... నువ్వు....

"నేను వనరాజునే! యింకా యిక్కడుండటం మంచిది కాదు పద!"

మౌనంగా అతన్ననుసరించాడు మృగరాజు

నిశ్శబ్దంగా చెక్కవంతెన దాకా వచ్చారు. "పెళ్ళి కాని పిల్లతో నాయకుడివి నువ్వే అలా తిరిగితే అందరూ ఏమనుకుంటారు మృగరాజూ!"

"........................"

"యిది మన జాతిలో ఎంత తప్పు?"

"........................"

"మాట్లాడవేం? నువ్విలా ప్రవర్తిస్తున్నావని తెలిస్తే ఆమె అన్నలు ఊరుకోరు. అసలే సన్న వనరాజును చేశావని వాళ్ళకు నీ మీద కచ్చగా ఉంది"

"బాగానే ఉంటారుగా....

"పైకి అలాగే ఉంటారు....

"ఎట్లా ఉంటే నాకేం నన్నేమైనా అంటే గుద్దుకు రక్తం కక్కిస్తా!"

"అట్లా అనుకోవద్దు! నువ్వు మృగరాజువి. నువ్వు ఎవరిని పెళ్ళిచేసుకోవాలనుకున్నా అభ్యంతరం ఉండదు....

ఆగాడు. మధు ముందే చెప్పింది. మృగరాజు కోరిక తీర్చమని. చెల్లెలు అతన్ని ప్రేమించిందని తెలిసినా, చెల్లెలే అలా చెప్పింది. ఆమె కిష్టమైన ఏపనైనా వనరాజు చేస్తాడు.

"నువ్వు మీ అయ్యతో చెప్పు! నేను కులపెద్దకి చెప్పి మీ ఇద్దరికీ దేవత ముందు ఒట్టువేయించేటట్లు చేస్తా!"

'నిజం! నిజం!!' నమ్మలేనట్లు చూశాడు.

'నిజమే! అన్నీ తెలిసిన నువ్వే ఇలా ప్రవర్తించటం మంచిదికాదు, నువ్వు మాత్రం గోదా అన్నలతో జాగ్రత్తగా ఉండు....

మృగరాజు సంతోషంతో వనరాజును ఎత్తి గిరగిర తిప్పి కుదేశాడు.

మర్నాటి రాత్రి వనరాజు, మృగరాజు, దేవత వెలసిన చెట్టు కిందికి వచ్చారు. మృగరాజు సైగ చెయ్యగానే, వెంటఉన్న వాడు కొమ్ము బూరా ఊదాడు. అందరూ ఒక్కచోట చేరడానికి అది సంకేతం. వెన్నెల ఇంకా రాలేదు గనక కాగడాలు వెలిగించి పట్టుకున్నారు, ముగ్గురు మనుష్యులు.

కొద్దిసేపట్లో అందరూ పోగయ్యారు.

వనరాజు సూటిగా ఆ విషయమే చెప్పాడు.

అది విని అందరూ తమలోనే మధు పక్కనే ఉన్న గోదావైపు చూశారు.

గోదా సిగ్గుతో ముడుచుకుపోయింది.

చెంచూ, ఘంటూ లిద్దరూ క్రోధంగా పళ్ళు పటపట మనిపించారు.

కులపెద్ద ముందుకు వచ్చాడు. తమ నాయకుడెవరిని పెళ్ళిచేసుకోవాలనుకున్నా అభ్యంతరం ఉండదనీ. దీనికి మిగతా పెద్దలుకూడా ఇష్ట పడ్డారని, ఆ పిల్లకు ఇష్టమైతే, యిక ఎవరి ఇష్టా ఇష్టాలతో పనిలేకుండానే దేవత ముందు వారిద్దరి పెళ్ళికి ఒట్టు వేయించబడుతుందనీ చెప్పాడు.

అందరూ గోలగా అరుస్తూ చప్పట్లు కొడుతూ, కేకలతో నాట్యం చేస్తున్నారు. ఎగురుతున్నారు. గోదా సిగ్గుచేత అక్కడ నిల్చోలేక పోయింది.

చెంచూ, ఘంటులకిది తలకొట్టేసినట్టుగా ఉంది.

అందరినీ సర్దాడు కులపెద్ద. వెన్నెల రాత్రిళ్ళు అయిపోవస్తున్నాయనీ. తమ నాయకుడి పెళ్ళి శుభప్రదంకాని చీకటి రాత్రుళ్ళలోగాని, వాటికి ముందు రోజుల్లో కాని జరగరాదనీ, మళ్ళీ వెన్నెల రాత్రిళ్ళ దాకా ఆగటం మంచిదనీ, ఈలోగా పెళ్ళి

(తరువాయి 28 వ పేజీలో)

## మధు

( 25 వ పేజీ తరువాయి )

కోలాహలానికి కావలసిన వెదురు బియ్యం తేనె, కాయలు, పళ్ళు, దుంపలు, తాటి నీరా, మద్యం వగైరా సేకరించాలనీ- అప్పుడు కావలసినంత వేడుకగా యీ పెళ్ళి జరుగుతుందనీ చెప్పాడు.

చెంచూ, మంటూ లిద్దరూ అప్పటికే ఆ గొడవలో లేరు వాళ్ళు కోపంగా గుడెశె వైపు వెళ్ళడం ఎవ్వరూ గమనించలేదు.

వాళ్ళు గుడిసెకు వచ్చేసరికి- గోదాను పరాచికం పట్టిస్తున్నది మధు. చుట్టు ప్రక్కల గుడిసెల్లో ఎవరూ లేరు. అందరూ దేవత ముందు- కోలాహలంలో మునిగి ఉన్నారు.

"గోదా!" పెద్దవాడు చెంచూ- అరిచాడు.

వాళ్ళిద్దరూ ఉలిక్కి పడ్డారు చెంచూ గబగబా వచ్చి గోదా రెక్కపట్టుకున్నాడు. యీ లోగా మధు ఒక్క గంతులో బైటికి జారుకుంది భయంగా!

చూర్లో ఉన్నతాడు తీసుకుని- గోదాను కొట్టాడు చెంచూ, గోదా అరవ బోయింది. కానీ మంటూ ఆమె నోరు నొక్కేశాడు.

మధూ బైటినుంచి చూస్తూనే ఉంది- లేడికి సందుల్లోనుంచి. తమ భాషలో ఉన్నన్ని తిట్లు తిడుతూ- యిద్దరూ అమెను చావబాదుతున్నారు. గోదా ఏడుస్తూ- బాధతో మెలికలు తిరుగుతోంది. తనను కొట్టవద్దని- దండంపెడుతూ, బతిమలాడుతూంది.

మధూ అలా చూస్తూనే నిల్చుంది. రచ్చబండ దగ్గరికి వెళ్ళి అందరితో యీ విషయం చెప్పాలనే జ్ఞానమే లేకుండా పోయిందామెకు అయినా ఆ గొడవలో తన మాటెవరు వినిపించుకుంటారు. వాళ్ళందరినీ తప్పించుకుని మృగరాజూ, వనరాజు దగ్గరికి వెళ్ళటం చాలాకష్టం.

మధు కళ్ళనీళ్ళు నింపుతూ అలాగే చూస్తూంది. వాళ్ళిద్దరూ ఆమెకు శోష వచ్చి- తమ చేతులు నొప్పిపుట్టేదాకా చావబాదార్లు. అక్కడక్కడా- గోదాకు దెబ్బల మూలంగా చర్మం చిట్లి రక్తం వస్తూంది. తెలివి తప్పిపోయిన గోదాను చేతులు విరిచి కట్టేస్తున్నారు. [సశేషం]

## మరువలేని మా శ్రీదేవిగారు

(తరువాయి 21 వ పేజీలో)

పెడుదురూ" అన్నాను. బస్‌స్టాప్ దాకా వెళ్ళాము. మరోరోజున ప్రెస్‌కు వెళ్ళి 'కొత్తబాట' అని వ్రాసివచ్చాను. తరువాత 'కొత్తబాట' ప్రారంభమైంది. ప్రీవియస్ పరీక్ష లైపోయిన తరువాత నరసరావుపేట వెళ్ళిపోయాను. "కొత్తబాట" పూర్తి చేసిపంపించాను. అప్పటికే "కాలాతీత వ్యక్తులు" పుస్తకరూపంలో వచ్చింది ఓరోజు వెళ్ళాను పుస్తకాలన్నీ బైండ్ కాలేదు. గెటప్ చాలా బావుంది "నాకో పుస్తకం కావాలన్నాను." ఇంకాఅన్నీ రాలేదు- అంటూనే ఇచ్చారు పేరు వ్రాసి ఇవ్వమన్నాను. ఇచ్చారు ఆరోజు యెంతసంతోషంగా వుండెనో! ఎంత గర్వంగా వుండెనో. ఆ పుస్తకం ద్వారానే యెన్నో కొత్త స్నేహాలైనాయి చుట్టుపక్కల ఇండ్లలో. ఆడవాళ్ళూ మగవాళ్ళూ నా విలువ పెంచారు. "కాలాతీత వ్యక్తులు" మంచి నవల. తరువాత ఆ సందర్భం యెందుకు వచ్చిందో చెప్పలేను ఏమిటో మాట్లాడుకుంటున్నాము. సమాజం, సుస్థితీ, మనుషులూ, రచనలూ, గురించి మాటాడుకుంటున్నాము. ఎప్పుడు మాట్లాడినా, ఉన్నచోటనే వుండిపోదాం, అంటూ వుండేవాణ్ణి నేను. మార్పును కోరతాను కాని భయం ఓడిపోతూ రాజీ పడటం యెందుకూ, ముందే తెల్లజెండా యెత్తితే యేం, పారిపోతేయేం, ఏమిటీ అరగబడటం, సంప్రదాయం చట్టుబండలూ వొప్పుకుంటేనేం-అని నావాదన. ఏ రచన గురించో మాట్లాడుకుంటున్నాము. అరాచకం నేను భరించలేను తిరుగుబాటంటే చచ్చే భయం, అని చెపుతున్నాను. వాళ్ళిద్దరూ ఓపిగ్గా వినేవాళ్ళు. మాట్లాడి మాట్లాడి అలసిపోయ్యేవాణ్ణి. ఇటువంటి ప్రసంగ సందర్భాలో "ఏమండీ, అయితే "కాలాతీత వ్యక్తులు" గురించి కూడా మీకు చాలా చిత్రమైన అభిప్రాయాలుండి వుంటాయి" అన్నారు. నేనేం చెప్పాలి. కాదు, కాలాతీత వ్యక్తులు-చెప్పటంలో ఆమె ప్రజ్ఞ చూపించారు. ఏపాత్ర సంభాషిస్తున్నా ఎబ్బెట్టుగా వుండదు. చాలా 'కన్విన్సింగ్'గా వుంటుంది. అందుచేతనే కాలాతీతవ్యక్తులు చదివి అంతమంది ఉత్తరాలు వ్రాశారు. ఎప్పుడూ ఆమెగారు నా యెడల యెంతో చనువుచూపేవారు. నేను యేమి మాట్లాడుతున్నా నవ్వేసేవారు. నాకర్థమయ్యేదికాదు. నేను అనుభవాన్ని మించి మాట్లాడు తున్నాననుకునే వారనుకుంటాను ఆమె. అందుకే నవ్వేసేవారు.

"మాశావా అన్నయ్యా యీన అరుణాచలం వెళతారట."

అవాళ ఇద్దరూ కలసి నన్ను చాలావుడికించారు. అమె యెప్పుడూ నవ్వుతూనే వుండేవారు. ఒక్కసారి మాత్రమే యీ మూడునాలుగేళ్ళ పరిచయంలో ఆమెవిసుక్కున్నారు జీవితాన్నిగురించి నాకు చాలా బాధకలిగింది.

ఎప్పుడు వెళ్ళినా మళ్ళీ నవలయెప్పుడు వ్రాస్తారని అడిగేవాణ్ణి. ఆమె నవ్వేసేవారు. ఆనవ్వులో మళ్ళీరాయాలన్న ఉత్సాహమూ రాయటంలేదన్న వెలితీ కన్పిస్తూనే వుండేవి. స్వతంత్ర వస్తున్నరోజుల్లో ఆమె సగంశక్తి స్వతంత్రకే ఖర్చయిపోయేది. వారంవారం విపులాచపృథ్వీ వ్రాసేవారు. మొదట మొదట ఒకటి రెండు చదివిన తరువాత నాకు చాలా ఆశ్చర్యమైంది. ఈమె యీ లోకవ్యవహారాల పైని వ్యాఖ్యలూ- విమర్శలూకూడా ఇంతబాగా యెలావ్రాస్తున్నారా? అని, స్వతంత్రకు వచ్చే 'కరస్పాండెన్స్' అంతా ఆమె చూచుకునేవారు. ఆ రచనలన్నీ చదివేవారు మీఓపికను అభినందించాల్సిందే- అనేవాణ్ణి. నవ్వేసేవారు వారం వారం యీ విపులాచపృథ్వీయే కాక, అప్పుడప్పుడు కథలూ, కవితా వ్రాస్తుండేవారు. అందుచేత నవల ఇంకోటి రాయటం ఆమెకు పడలేదు. స్వతంత్ర రెండోసారి ఆగిపోయి, మళ్ళీ మొదలైనప్పుడు ఆంధ్రప్రభ దినపత్రికలో స్వతంత్రలో రచనల గురించి వోప్రకటన వెలువడింది స్వతంత్రమళ్ళీ వస్తున్నది. త్వరలో స్వతంత్రలో శ్రీదేవిగారి నవల ప్రారంభించ బోతున్నాం. అని ఆప్రకటన సారాంశం. నాకు ఆశ్చర్యంతో పాటు ఆనందం కూడా కలిగింది. వెళ్ళిఅడిగినప్పుడు ఆమెగారు నవ్వారు. శాస్త్రిగారికేసి చూస్తూ- ఈయన గారు చేసినపని అది. నాకుతెలీదు. ఇలా